సాక్షి అనకాపల్లి

గురువారం ❘ 18 ❘ జనవరి ❘ 2024



బకాయిల చెల్లింపు

చెరకు రైతుల ఖాతాల్లో గోవాడ సుగర్స్ రూ.9.30 కోట్ల బకాయిలను జమ చేసింది. కార్మికుల వేతనాలను చెల్లించనుంది.

10లో



వీసీగా ఆచార్య ప్రసాదరెడ్డి

ఏయూ వీసీగా ఆచార్య ప్రసాదరెడ్డి రెండోసారి నియమితులయ్యారు. తన దార్శనికతతో వర్సిటీ రూపురేఖలను పూర్తిగా మార్చేశారు.

10లో



కలా.. నిజమా!

సంక్రాంతికి సొంతూరు వచ్చిన పూర్వ విద్యార్థులు తమ పాఠశాలలో జరిగిన అభివృద్ధిని చూసి ఆశ్చర్యపోయారు.

10లో



మాకవరపాలెం మండలం భీమబోయినపాలెంలో నిర్మాణ దశలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాల



అనకాపల్లి-ఆనందపురం గ్రీన్‌ఫీల్డ్ హైవే

దేశానికి తీపిని పంచే అనకాపల్లి గుండెల్లో చేదు కథలెన్నో... పచ్చని పొలాలు... గలగలపారే సెలయేళ్లు.. ఆవలు, బౌద్ధారామం.. ప్రసిద్ధిగాంచిన ఆలయాలు, ప్రకృతి వనరులకు ఆలవాలమైన జిల్లాలో సమస్యలెన్నెన్నో... ఇదంతా గతం... నాలుగున్నర ఏళ్ల కిందట అధికారం చేపట్టిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జిల్లా తలరాతను మార్చింది. ప్రజలకు పాలనను మరింత చేరువ చేసేందుకు అనకాపల్లి కేంద్రంగా కొత్త జిల్లాను ఏర్పాటు చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో 'అనకాపల్లి' ప్రగతి పథంలో పరుగులు తీస్తోంది. కొత్తగా వచ్చిన 35 భారీ, 11,343 చిన్నతరహా పరిశ్రమల ద్వారా సుమారు లక్షమందికి ఉపాధి అవకాశాలు కలిగాయి. సచివాలయ వ్యవస్థతో మారుమూల పల్లెకు సుపరిపాలన అందింది. నర్సీపట్నం నియోజకవర్గంలో రూ.500 కోట్లతో మెడికల్ కళాశాల నిర్మాణం చేపట్టారు. సుందర, విశాలమైన రోడ్లపై శరవేగంగా అభివృద్ధి పరుగులు పెడుతోంది. విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి రంగాలకు పెద్ద పీట వేయడంతోపాటు సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యం ఇస్తూ **ప్రియతమ సీఎం జిల్లా ప్రజలకు కొత్త బంగారులోకాన్ని పరిచయం చేశారు.**

సంక్షేమ ఫలాలు

పథకం	లబ్ధిదారుల సంఖ్య	అందిన మొత్తం (రూ.కోట్లలో)
రైతు భరోసా	2,50,888	14.64
అమ్మ ఒడి	6,32,421	726.8
చేయూత	1,15,101	557.38
ఆసరా	3,63,346	821.47
పింఛన్ కానుక	2,67,651	77.90
కాపు నేస్తం	67,151	100.69
వాహనమిత్ర	58,395	58.39
ఆరోగ్యశ్రీ	1,49,516	296.33
జగనన్న హౌసింగ్	55,385	434.43
సున్నావడ్డీ	3,88,297	118.75
జగనన్న చేదోడు	37,731	37.73
జగనన్న తోడు	13,244	14.01

కొత్త బంగారులోకం

- **పారిశ్రామిక పరుగులు.. యువతకు ఉద్యోగాలు**
- **నూతన జిల్లాలో సమపాళ్లలో అభివృద్ధి, సంక్షేమం**
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక 35 భారీ పరిశ్రమలు, 11,343 ఎంఎస్‌ఎంఈల ఏర్పాటు
- వైద్య విద్య, అధునాతన వైద్యం అందేలా మెడికల్ కాలేజీ నిర్మాణం
- సుందరంగా అనకాపల్లి-ఆనందపురం గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి
- సచివాలయ వ్యవస్థతో ప్రజలకు చేరువగా ప్రభుత్వ సేవలు

సాక్షి, అనకాపల్లి:

వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన అనకాపల్లి కొత్త జిల్లాగా ఏర్పడి.. ప్రగతి పథంలో పరుగులు పెడుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఒకవైపు సంక్షేమం, అభివృద్ధి.. మరోవైపు నూతన పరిశ్రమల ఏర్పాటుతో కళకళలాడుతోంది. సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామాల్లో ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. పాఠశాలల అభివృద్ధి, హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విద్య, వైద్యం అందుబాటులోకి వచ్చాయి. వేలాది కోట్ల రూపాయలతో సంక్షేమాభివృద్ధి సాధ్యమైంది. మాకవరపాలెం మండలం భీమబోయినపాలెంలో రూ.500 కోట్లతో మెడికల్ కళాశాల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. పారిశ్రామిక హబ్‌గా కొత్త పుంతలు తొక్కుతున్న అనకాపల్లి జిల్లాలో కొత్తగా వచ్చిన భారీ, మధ్యతరహా, చిన్నతరహా పరిశ్రమలతో సుమారు లక్షమందికి ఉద్యోగాలు రాగా.. రానున్న పరిశ్రమలతో రెండు లక్షలమంది వరకు ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. గ్రీన్‌ఫీల్డ్ హైవే జిల్లాకు కొత్త అందాన్ని తీసుకువచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా పెద్ద మొత్తంలో వెచ్చిస్తోంది.

ప్రజల కల.. ప్రభుత్వ వైద్య కళాశాల

ప్రభుత్వం జిల్లాకో ప్రభుత్వ వైద్య కళాశాలను మంజూరు చేసింది. అనకాపల్లి జిల్లాలో మాకవరపాలెం మండలం భీమబోయినపాలెంలో 52.17 ఎకరాల్లో రూ.500 కోట్లతో ఈ కాలేజీ నిర్మిస్తున్నారు. 2022 డిసెంబర్ 30న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. వచ్చే డిసెంబర్‌లో ప్రారంభించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. 630 పడకలతో మెడికల్ కళాశాల రూపుదిద్దుకుంటోంది.



బోయలకింతాడ సచివాలయం

నాడు-నేడు.. తేడా చూడు



తుమ్మపాల జెడ్పీ హైస్కూల్

జిల్లాలో 'నాడు-నేడు'లో భాగంగా రెండు దశల్లో 1,057 స్కూల్స్‌ను 272.73 కోట్లతో ఆధునికీకరించారు. ఒక్కో నియోజకవర్గంలో రూ.5 లక్షలతో 68 అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేశారు. మొదటి విడతగా నాడు-నేడు పథకంలో అభివృద్ధి చేసిన 186 ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 1146 ఐఎఫ్‌పీ (ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్)లను అందించారు. మరో 254 ప్రాథమిక పాఠశాలల్లో 354 స్మార్ట్ టీవీలతో విద్యాబోధన ప్రారంభించారు. గతేడాది 8వ తరగతి చదువుతున్న 19,250 మందికి ట్యాబ్‌లను అందించగా.. ఈ ఏడాది మరో 15,201 మంది 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు.

పేదలందరికీ ఇళ్లు



సామాన్యుల పాలిట వరం టిడ్కో ఇళ్లు

జిల్లాలో 682 లేఅవుట్లు అభివృద్ధి చేశారు. 34,431 ఇళ్ల స్థలాలకు పట్టాలు మంజూరు చేశారు. రూ.1055 కోట్లతో మొత్తం 58,626 ఇళ్లు మంజూరు కాగా..వాటిలో యూడీఏ పరిధిలో 47,738 గృహాలు, పట్టణ ప్రాంతాల్లో 10,888 ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. పీఎంఏవై కింద రూ.96.5 కోట్లతో 4383 ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. ఓటీఎస్ స్కీం ద్వారా ఇప్పటివరకు 36,335మంది లబ్ధిదారులకు గానూ 29,010 మందికి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ పట్టాలు ఇచ్చారు. ఉపాధి హామీ పథకం ద్వారా రూ.30.87 కోట్లు మంజూరు చేశారు. రూ.153 కోట్లతో 2,744 టిడ్కో గృహాలను పూర్తి చేశారు.

మత్స్యకారులకు మహర్దశ

గంగపుత్రులు ఎక్కువగా ఉన్న పాయకరావుపేట, యలమంచిలి నియోజకవర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త ప్రాజెక్టులు మంజూరు చేసింది. నక్కపల్లి మండలంలో ఫిష్‌లాండింగ్ సెంటర్, అచ్యుతాపురం మండలంలో జెట్టీ, ఫిషింగ్ హార్బర్ నిర్మాణాలు చేపడతారు. నక్కపల్లి మండలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా సుమారు రూ.24 కోట్లతో జెట్టీతోపాటు ఫిష్‌లాండింగ్ సెంటర్ నిర్మిస్తాయి. దీని నిర్మాణానికి 10 ఎకరాల స్థలం కావాల్సి ఉంది. రాజయ్యపేట, చందనాడ, బోయపాడు, తీరప్రాంతాల్లో స్థలాలను అధికారులు పరిశీలించి ప్రభుత్వ ఆమోదానికి పంపించారు. దీని నిర్మాణం వల్ల పాయకరావుపేట నియోజకవర్గంలో సుమారు 17 మత్స్యకార గ్రామాల్లో వేట సాగించే ఏడువేల మందికి పరోక్షంగా ఉపయోగం ఉంటుంది. మత్స్యసంపద ఎగుమతి, దిగుమతులకు అనుకూలంగా స్టోరేజ్ చేయడానికి సౌకర్యాలు కల్పిస్తారు. అచ్యుతాపురం మండలంలో సుమారు రూ.350 కోట్లతో ఫిషింగ్ హార్బర్ నిర్మించనున్నారు.

రహదారుల నిర్మాణం



సీసీ డ్రైయిన్లతో గ్రామాల్లో పరిశుభ్రత

పంచాయతీరాజ్‌శాఖ పరిధిలో జిల్లాలో రూ.118 కోట్లతో 354 కి.మీ మేర బీటీ రోడ్లు, రూ.41 కోట్లతో 82 కి.మీ మేర సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. ఆర్ అండ్ బీ శాఖలో ఎస్‌డీబీలో రూ.220 కోట్లతో 10 రహదారులకు నిధులు మంజూరయ్యాయి. వీటిలో 5 రోడ్లు పురోగతిలో ఉన్నాయి. మరమ్మతులకు రూ.82.50 కోట్లతో 72 పనులు మంజూరయ్యాయి. పురోగతిలో ఉన్నాయి. సీఆర్‌ఎఫ్‌లో భాగంగా 10 కోట్లతో రెండు పనులు మంజూరయ్యాయి. ఆర్‌వోబీ కింద మూడు పనులకు రూ.116.7 కోట్లు మంజూరయ్యాయి. వీటిలో ఒక పని పురోగతిలో ఉంది. మరొకటి టెండర్ ప్రక్రియలో ఉంది.

వ్యవ'సాయం'



తగరంపూడి రైతు భరోసా కేంద్రం

జిల్లాలో 450 ఆర్బీకేల ద్వారా ఖరీఫ్, రబీ సీజన్లలో 51,279 మెట్రిక్ టన్నుల ఎరువులు, 865.5 క్వింటాళ్ల విత్తనాలు సబ్సిడీపై అందజేశారు. 2,50,044 ఎకరాల్లో వేసిన వివిధ పంటలను ఈ-పంటలో నమోదు చేశారు. 23 కిసాన్ డ్రోన్ సీహెచ్‌సీ గ్రూపులకు డ్రోన్ పైలెట్ ఉచిత శిక్షణ అందించారు. 9,173 మంది కౌలు రైతులకు సాగుహక్కు కార్డులు అందించారు. జిల్లాలో 450 కస్టం హైరింగ్ సెంటర్లలో ఇప్పటివరకు 420 గ్రూపులకు రూ.937.92 లక్షల రాయితీతో 229 ట్రాక్టర్లు , వివిధ వ్యవసాయ పరికరాలను సరఫరా చేశారు. 6 నియోజకవర్గాల్లో డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. 616 నమూనాలను సేకరించి పరీక్షలు చేశారు.

ఆస్పత్రుల ఆధునికీకరణ



అరుంధతీనగర్ యూపీహెచ్‌సీ

జిల్లాలో 45 పీహెచ్‌సీలు, 9 యూపీహెచ్‌సీలు, 424 ఉపకేంద్రాల ద్వారా వైద్యసేవలందిస్తున్నారు. నాడు-నేడులో భాగంగా 7 కొత్త భవనాల నిర్మాణం, 38 భవనాలకు మరమ్మతు పనులు చేపట్టారు.

- 2019 నుంచి 2023 వరకు ఆరోగ్యశ్రీలో 1,49,516 మందికి వైద్యసేవలు అందాయి. వైఎస్సార్ ఆరోగ్య ఆసరాలో రూ.43.19 కోట్లతో 5,27,708 మందికి లబ్ధి చేకూరింది. విలేజ్ క్లినిక్‌ల ద్వారా 3,95,499 మంది రోగులకు చికిత్స అందించారు.
- రూ.3 కోట్ల చొప్పున వెచ్చించి నక్కపల్లి, యలమంచిలి, కోటవురట్ల సీహెచ్‌సీల్లో ఉన్న 30 పడకలను 50కి పెంచారు. రూ.5.6 కోట్లతో కె.కోటపాడు సీహెచ్‌సీలో 30 పడకలను 50 పడకలు అప్‌గ్రేడ్ చేశారు.
- రూ.5.29 కోట్లతో వి.మాడుగుల ఆస్పత్రిలో 30 పడకలు ఏర్పాటు చేశారు.
- అనకాపల్లిలోని ఎన్టీఆర్ జిల్లా ఆస్పత్రిలో రూ.22.25 కోట్లతో 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు.
- జిల్లాలో రెండు డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ నిర్మాణాలను నర్సీపట్నంలో రూ.45 లక్షలతో, అనకాపల్లిలో రూ.45 లక్షలతో పూర్తి చేశారు.

అనకాపల్లి జిల్లా.. పారిశ్రామిక ఖిల్లా

జిల్లాలో 2019 నుంచి 2023 వరకు 35 భారీ పరిశ్రమలను ఏర్పాటు చేశారు. అతి తక్కువ కాలంలోనే కొత్తగా వచ్చిన భారీ పరిశ్రమల వివరాలు ఈ విధంగా ఉన్నాయి..

- 2020లో రూ.26 కోట్లతో సన్‌రేయ్ మెటలర్జికల్ ఇండస్ట్రీస్, రూ.960 కోట్లతో డెక్కన్ ఫైన్ కెమికల్స్, రూ.559 కోట్లతో రుషిల్ డెకార్ లిమిటెడ్, రూ.200 కోట్లతో పిడిలిటీ ఇండస్ట్రీ యూనిట్-1, రూ.346 కోట్లతో సోలారి యా ఆక్టివ్ ఫార్మా, రూ.150 కోట్లతో నాక్టో ఫార్మా కంపెనీ, రూ.54 కోట్లతో సాయి మెరైన్ ఎక్స్‌పోర్టు
- 2021లో రూ.300 కోట్లతో సన్విరా కెమికల్స్ అండ్ ఇంజనీర్ ప్రైవేట్ లిమిటెడ్, రూ.350 కోట్లతో ఇమెరీస్ అల్యూమినేట్స్, రూ.150 కోట్లతో చెట్టినాడ్ సిమెంట్ కార్పొరేషన్, రూ.60 కోట్లతో ఐఎస్‌జీఎల్ రిఫ్రాక్షనరీస్ రూ.750 కోట్లతో రైన్ సీఐఐ కార్బన్
- 2020లో రూ.50 కోట్లతో స్పైరా ల్యాబ్స్, రూ.509.77 కోట్లతో సెయింట్ గోబైన్ ఇండస్ట్రీస్, రూ.1135 కోట్లతో ఏటీసీ టైర్స్, రూ.292 కోట్లతో రాజధిరాజ్ తిరుపని వినాయక్ నటరాజ్ ప్రైవేట్ లిమిటెడ్
- 2023లో రూ.6700 కోట్లతో పయినీర్ అల్యూమినియం ఇండస్ట్రీ, రూ.174 కోట్లతో విన్‌విన్ స్పెషాలిటీ ఇన్సులేటర్, రూ.460 కోట్లతో లారెస్ సింథసిస్ యూనిట్-4, రూ.60 కోట్లతో అమర్ లైఫ్ సైన్సెస్, రూ.202 కోట్లతో పిడిలైట్ ఇండస్ట్రీస్, రూ.178 కోట్లతో రిఫ్రాటిక్నిక్, రూ.85 కోట్లతో దాల్వ్‌కోట్ బయోఫ్యూస్, రూ.440 కోట్లతో లారస్ ల్యాబ్ యూనిట్-2, రూ.450 కోట్లతో అరబిందో అనుబంధ సంస్థ అయిన యుజియా స్టెరీస్ కంపెనీ, రూ.501 కోట్లతో ద రామ్‌కో సిమెంట్ ప్రైవేట్ లిమిటెడ్, రూ.173 కోట్లతో ఎస్కినిషియా అడ్వాన్స్ లైఫ్ సైన్స్ లిమిటెడ్, రూ.110 కోట్లతో తేజయ్ ఇండియా



లక్షలాదిమందికి ఉపాధినిస్తున్న పరిశ్రమలు

ఎంఎస్‌ఎంఈల ద్వారా ప్రోత్సాహకాలు

జిల్లాలో ఉన్న నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను (ఎంఎస్ఎంఈ)లను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. గత సర్కారు ఎగ్గొట్టిన రూ.962.05 కోట్ల పారిశ్రామిక ప్రోత్సాహకాలను చెల్లించడమే కాకుండా, రాయితీలను ఎప్పటికప్పుడు అందిస్తోంది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నుంచి నేటి వరకు జిల్లాలో 35 భారీ పరిశ్రమలు, 11,343 ఎంఎస్‌ఎంఈ ఇండస్ట్రీస్ ఏర్పాటు చేశారు. వీటి ద్వారా సుమారు లక్ష మందికి ఉద్యోగాలు కల్పించారు. అనకాపల్లి మండలం కోడూరు గ్రామంలో సుమారు 70 ఎకరాల్లో ఎంఎస్‌ఎంఈ పార్కు, ఆటోనగర్‌ను అభివృద్ధి చేస్తున్నారు. రూ.36 కోట్లతో పార్క్‌లో సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నారు. మొదటి విడతగా సుమారు రూ.13 కోట్ల వ్యయంతో రహదారులు, డ్రైనేజీ, వర్షం నీరు వెళ్లేందుకు కాలువలను నిర్మించనున్నారు.



కోమళ్లపూడిలో ఎస్ఈజెడ్ : బుచ్చెయ్యపేట మండలం కోమళ్లపూడి గ్రామంలో ఎస్ఈజెడ్ ఏర్పాటుకు 200 ఎకరాల స్థలం కేటాయించారు. మరో 300 ఎకరాల స్థలసేకరణకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.

బల్క్ డ్రగ్ పార్క్: విశాఖ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగమైన నక్కపల్లి క్లస్టర్‌లో బల్క్ డ్రగ్ పరిశ్రమ ఏర్పాటు కానుంది. ఈ పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన 2 వేల ఎకరాల ప్రభుత్వ భూమిని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ఈ పరిశ్రమ ఏర్పాటయితే ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 10 వేలమందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఇప్పటికే పాయకరావుపేట నియోజకవర్గంలో హెటిరో, డక్కన్ కంపెనీలు తమ కార్యకలాపాలు సాగిస్తున్నాయి.

కలలోనైనా ఊహించ లేదు...

- మా బడి ఇంత అభివృద్ధి చెందిందా..?
- వేల్పుల వీధి బాలికోన్నత పాఠశాలను చూసి ఆశ్చర్యపోయిన పూర్వ విద్యార్థినులు
- ఊయల ఊగి... ప్రాంగణంలో కలయ తిరిగి మురిసిపోయిన ఆడపడుచులు



బాలికోన్నత పాఠశాల ముందు పూర్వ విద్యార్థినులు

అనకాపల్లి: ఇది మన బడేనా... ఎంతలా మారిపోయిందో అంటూ స్థానిక జీవీఎంసీ వేల్పులవీధి బాలికోన్నత పాఠశాలను చూసిన పూర్వపు విద్యార్థినులు ఆశ్చర్యానికి గురయ్యారు. సంక్రాంతిని పురస్కరించుకుని అత్తవారిళ్ల నుంచి అనకాపల్లి వచ్చిన పలువురు పూర్వ విద్యార్థినులు తమ పాఠశాలను చూసి ఆనందంతో ఉబితబ్బిబయ్యారు. ఇంత అభివృద్ధి కలలోనైనా ఊహించలేదని వారు చెప్పారు. 2006 నుంచి 2013 వరకు బాలికోన్నత హైస్కూల్లో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థినులంతా ఒకచోట కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. తాము చదువుకున్న స్కూల్‌నే అందుకు వేదికగా ఎంచుకున్నారు. బుధవారం వారంతా స్కూల్‌ను సందర్శించి మురిసిపోయారు. ఆడుకునేందుకు పాఠశాల గ్రౌండ్‌కు వచ్చిన ప్రస్తుత విద్యార్థినులు, వాచ్‌మెన్‌తో కాసేపు ముచ్చటించారు. తాము చదువుకున్నప్పుడు కనీస మౌలిక వసతులు లేకపోవడంతో చాలా ఇబ్బందులకు గురయ్యామని తెలిపారు. ప్రస్తుత సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు ద్వారా పాఠశాలలు రూపురేఖలు మార్పు చేస్తూనే విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడం గర్వంగా ఉందన్నారు. క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన ఊయలలో ఊగుతామంటూ సరదాగా గడిపారు. నాణ్యమైన విద్యాబోధనతో పాటు, విద్యార్థినులకు కావాల్సిన సదుపాయాలు కల్పించడం సంతోషంగా ఉందంటూ వారి తెలిపారు. తాము నేలమీద కూర్చొని చదువుకునే వారమని, బ్లాక్‌బోర్డుపై రాసేందుకు సుద్దముక్కలు కూడా సరిగా ఉండేవి కావని తెలిపారు. ఇప్పుడు డిజిటల్ తరగతులతో పాఠ్యాంశాలు ఇట్టే అర్థమయ్యేరీతిలో మార్పులు తీసుకురావడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి విద్యార్థినులు బైజూస్ ట్యాబ్‌ల ద్వారా ఇళ్ల వద్ద పాఠ్యాంశాలను మరోసారి నేర్చుకోవడంతో వారు ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు అవకాశం ఏర్పడిందని చెప్పారు. తాము ఏడుగురం ప్రతి ఏటా సంక్రాంతి పండగకి ఒకేరకం చీరలు ధరిస్తుంటామని చెప్పారు.

చాలా మార్పులు జరిగాయి..



స్కూల్ చాలా మారింది. 2006 నుంచి 2013 వరకు ఇదే స్కూల్లో చదువుకున్నాను. అప్పటికీ ఇప్పటికీ చాలా తేడా కనిపిస్తోంది. తాము చదువుకున్న సమయంలో బ్లాక్‌బోర్డులపై పాఠ్యాంశాలు బోధించేవారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న డిజిటల్ తరగతుల వల్ల విద్యార్థినులకు పాఠాలు సులభంగా అర్థమవుతున్నాయి.

–సీహెచ్.కుమారి, ఎ.కోటపాడు

స్కూల్‌ని చూసి మురిసిపోయా...



తాను చదువుకున్న హైస్కూల్ ఇంత బాగా అభివృద్ధి చెందుతుందని ఊహించేదు. గతంలో ప్రభుత్వ పాఠశాలలంటే ఎవరూ పట్టించుకునేవారు కాదు. ఇప్పుడు అదరహో అన్నట్టు మార్పుచేశారు. తరగతి గదులన్నీ అందంగా తీర్చిదిద్దారు. స్కూల్ గోడలపై మహాత్ముల ముఖచిత్రాలతో కూడిన పెయింటింగ్‌లతో స్కూల్ ఆహ్లాదకరంగా మారింది. చాలా ఆనందంగా ఉంది.

–ఎం.రాణి, రాజమహేంద్రవరం

నమ్మలేక పోతున్నాం..

- కొత్తపేట జెడ్పీ హైస్కూల్‌ను చూసి ఆశ్చర్యపోయిన పూర్వ విద్యార్థులు
- కార్పొరేట్‌కు మించిన వసతులుండడంతో ఫిదా
- ముఖ్యమంత్రి జగన్ కృషిని ప్రశంసించిన స్థలదాత కుటుంబ సభ్యుడు


నాలుగేళ్లలో పాఠశాలలో జరిగిన అభివృద్ధిని వివరిస్తున్న రిసోర్సు పర్సన్ సూర్య ప్రకాష్


నాడు నేడుతో రూపురేఖలు మారిన కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

కొత్తపేట హైస్కూల్‌లో సెల్ఫీలు తీసుకుంటున్న పూర్వ విద్యార్థులు

యలమంచిలి రూరల్: 'ముళ్లకంపల దారి..శిథిలావస్థలో గదులు..పెచ్చులూడుతున్న పై కప్పు.. పగిలిపోయిన గచ్చు..నేలమీద చెట్లకింద చదువులు..తాగునీటి కొరత..ఇలా ఎన్నో అసౌకర్యాలుండే మన స్కూలేనా ఇది. నాలుగేళ్లలో మన బడి రూపురేఖలే మారిపోయాయి. పాత అసౌకర్యాల ఆనవాళ్లు మచ్చుకైనా కనిపించడంలేదంటూ' బుధవారం యలమంచిలి కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించిన ఓల్డ్ స్టూడెంట్స్ ఆశ్చర్యపోయారు. తమ పాఠశాలలో కార్పొరేట్‌ను తలదన్నేలా కల్పించిన పలు అధునాతన సౌకర్యాలను చూసి అబ్బురపడ్డారు. అధునాతన తరగతి గదులు, గోడలపై తీర్చిదిద్దిన రంగురంగుల బొమ్మలు, ఆర్వో ప్లాంట్ ద్వారా తాగునీటి సదుపాయం, బాలబాలికలకు, బోధన సిబ్బందికి వేర్వేరుగా పరిశుభ్రంగా ఉన్న టాయిలెట్లు, తరగతి గదుల్లో బ్లాక్ బోర్డుల స్థానంలో ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్(ఐఎఫ్‌పీ), విశాలమైన తరగతి గదుల్లో డెస్కుల తో కూడిన బెంచీలు, అధునాతన సైన్స్ ల్యాబ్‌లు, గ్రానైట్ ఫ్లోరింగ్, అందమైన ముఖద్వారం, గ్రీనరీ తదితర సౌకర్యాలను చూసి ఆనందించారు. మనబడి నాడు–నేడు పథకం ద్వారా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సర్కారీ బడుల రూపురేఖలను ఇంతలా మార్పుచేసి సుందరంగా తీర్చిదిద్దడం నిజంగా అద్భుతమని, ఇదంతా నాలుగేళ్లలో చేశారంటే నమ్మలేకపోతున్నామంటూ పూర్వ విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వాని హ్యాట్సాఫ్ చెప్పారు. వీటితోపాటు జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా రోజుకో మెనూతో విద్యార్థులకు పెడుతున్న నాణ్యమైన భోజనం, జగనన్న విద్యాకానుకగా అందిస్తున్న షూ,బెల్టు,బ్యాగు, పుస్తకాలు,బైజూస్ కంటెంట్‌తో 8వ తరగతి విద్యార్థులకు అందిస్తున్న ట్యాబ్‌లు,అమ్మఒడి పథకం కింద తల్లుల ఖాతాలో ఏడాదికి రూ15 వేలు జమ చేయడం,పదో తరగతి పరీక్షల్లో ఉత్తమంగా రాణించే విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు పేరుతో అందిస్తున్న ఆర్థిక ప్రోత్సాహం, ఆంగ్లమాధ్యమంలో బోధన తదితర మార్పులను తెలుసుకున్న వారు హర్షం వ్యక్తం చేశారు. పలువురు విద్యార్థులు తాము చదువుకున్న తరగతి గదుల్లో కాసేపు కూర్చుని అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పలు చోట్ల సెల్ఫీలు తీసుకుని ఆనందం వ్యక్తం చేశారు. అంతకుముందు పూర్వవిద్యార్థులు సమావేశం నిర్వహించి నాలుగేళ్లలో జరిగిన పాఠశాల అభివృద్ధి గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుసర్ల సూర్య ప్రకాష్, ఎ. శ్రీనివాసరావు, ఎ. చంద్రశేఖర్, ఎ. రత్నరాజు,తెరపల్లి చంద్రశేఖర్,పి కౌసల్య ఏ అమరావతి,పి శివాజీ పాల్గొన్నారు.

ఇంతకన్నా ఏం కావాలి?



ప్రతి తల్లి,తండ్రి తమ బిడ్డలను అన్ని వసతులు ఉన్న పాఠశాలల్లోనే చేర్పించాలని భావిస్తారు.గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు అంతంతమాత్రంగానే ఉండేవి.విధిలేని పరిస్థితుల్లో ప్రైవేటు స్కూళ్ల వైపు వెళ్లాల్సి వచ్చేది.ఇపుడు ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు సమకూర్చింది. సబ్జెక్టు టీచర్లను నియమించారు.విద్యార్థులకు కావాల్సినవన్నీ ప్రభుత్వమే సమకూరుస్తోంది. ఇంతకన్నా ఏమి కావాలి?. సీఎం జగన్ విజన్ చాలా బాగుంది. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు సమూలంగా మార్పుచేయడం నిజంగా ఎవరూ ఊహించలేదు.

– వై.వి. రమణ,హెచ్ఎం,జెడ్పీ హైస్కూల్ కొత్తపేట, యలమంచిలి

అప్పటికీ ఇప్పటికీ చాలా తేడా..



నేను ఈ స్కూల్‌లో 7వ తరగతి(2015–16) నుంచి 10వ తరగతి (2018–19) వరకు చదివాను.నాడు నేడు నిధులతో మేము చదివిన స్కూల్లో మౌలిక వసతులు కల్పించడంతో కార్పొరేట్‌కు దీటుగా మారింది.గతంలో మేము ఇక్కడ చదువుకున్న సమయంలో టాయిలెట్‌కు వెళ్లాలంటేనే చాలా ఇబ్బంది పడేవాళ్లం. తీవ్రమైన దుర్వాసన వచ్చేది.ఇప్పుడు మా ఇళ్లలో కూడా ఇంత అందమైన మరుగుదొడ్లు లేవు.అప్పటికీ ఇప్పటికీ స్కూలు రూపురేఖలే మారిపోయాయి.పేద పిల్లల చదువుకోసం ఇంతగా ఆలోచిస్తున్న సీఎం జగన్ చర్యలు నిజంగా గొప్పగా ఉన్నాయి.

– చెన్నా సారిక, కాకివానివీధి, పూర్వ విద్యార్థిని

చాలా హ్యాపీ..



నేను అమెరికా చికాగోలో పీజీ చదువుతున్నాను. సంక్రాంతి పండగకు కొద్ది రోజుల క్రితం యలమంచిలి వచ్చాను. మా ముత్తాత ఆచాళ్ల వీరభద్రరావు సోదరుడు సూర్యనారాయణ పేరుతో ఇక్కడ స్కూల్ ఏర్పాటు చేయడానికి 1975లో 1.89 ఎకరాలు దానమిచ్చారు.నా చిన్నతనంలో ఈ స్కూల్ ఆవరణలో ఆడుకునే వాడిని. అప్పుడంతా పొదలు,చెట్లు,రాళ్లతో నిండి ఉండేది.ఇపుడు స్కూల్‌ను చూస్తే 100 శాతం మారిపోయిందనిపించింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. చాలా సంతోషంగా ఉంది.

– ఆచాళ్ల సంపత్, పాఠశాల స్థలదాత కుటుంబసభ్యుడు,కొత్తపేట

కలెక్టర్ రక్తదానం


రక్తదానం చేస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

అనకాపల్లి: రక్తదానం చేయడం ద్వారా మరొకరికి ప్రాణదానం చేసినట్లు అవుతుందని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. సామాజిక సమతా సంకల్పం మహోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో బుధవారం ఆయన రక్తదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్తదానంపై అపోహలు వీడాలని, దీని వల్ల కొత్త రక్తం చేకూరి ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, డీఎంఅండ్‌హెచ్‌వో ఎ.హేమంత్, డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, ఏపీడీ డైజీ, సాంఘిక సంక్షేమ శాఖ ఏడీ అజయ్‌బాబు పాల్గొన్నారు.

22న ఓటర్ల తుది జాబితా ప్రకటన

తుమ్మపాల: జిల్లా ఓటర్ల తుది జాబితాను ఈనెల 22వ తేదీన ప్రకటించనున్నట్టు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. బుధవారం పలు రాజకీయపార్టీల ప్రతినిధులతో కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 26 కేంద్రాల్లో వికలాంగుల కోసం ర్యాంపులను నిర్మించవలసి ఉందన్నారు. త్వరలోనే వాటిని పూర్తి చేస్తామని తెలిపారు. 914 ప్రాంతాల్లో ఓటర్ల అవగాహన సదస్సులు నిర్వహించాల్సి ఉండగా, ఇప్పటివరకు 459 ప్రాంతాల్లో నిర్వహించినట్టు చెప్పారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఎటువంటి సందేహాలు ఉన్నా రాజకీయ పార్టీల ప్రతినిధులు వెంటనే తమకు తెలియజేయాలన్నారు. ఈనెల 25వ తేదీన నిర్వహించే జాతీయ ఓటర్ల దినోత్సవంలో అన్ని రాజకీయ పార్టీల వారు పాల్గొనాలని కోరారు.

నేడు ఎన్నికల జాబితా పరిశీలకుడు రాక

మహారాణిపేట: ఎన్నికల జాబితా పరిశీలకుడు, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జె.శ్యామలరావు గురువారం విశాఖ జిల్లాలో పర్యటించనున్నారు. కలెక్టరేట్‌లో ఈఆర్వోలు, ఇతర అధికారులతో ఎన్నికల జాబితా సవరణ ప్రక్రియపై సమీక్ష నిర్వహించనున్నారని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు.

గోవాడ సుగర్స్ రైతుల బకాయిలు చెల్లింపు

- ఖాతాల్లో రూ. 9.30 కోట్లు జమ
- కార్మికుల జీతభత్యాలకు రూ. 3కోట్లు చెల్లింపునకు చర్యలు

చోడవరం: రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో గోవాడ సుగర్స్ చెరకు రైతుల పాతబకాయిలను పూర్తిగా చెల్లించారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల 2022–23 క్రషింగ్ సీజన్‌కు సంబంధించి రైతులకు సుమారు రూ.9.30 కోట్లను ఫ్యాక్టరీ బకాయి పడింది. రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో ఈ బకాయిల సొమ్మును బుధవారం రైతుల ఖాతాల్లోకి ఫ్యాక్టరీ యాజమాన్యం జమచేసింది. గత సీజన్‌లో 2,21,246 టన్నుల చెరకు క్రషింగ్ చేశారు. కేంద్రప్రభుత్వం ఇచ్చిన ఎఫ్ఆర్‌పీ చెరకు మద్దతు ధర టన్నుకు రూ.2,821. ఈమొత్తంలో టన్నుకు రూ.2,500 చొప్పున ఆ సీజన్ ముగిసిన వెంటనే రైతుల ఖాతాల్లోకి జమచేశారు. మిగతా టన్నుకి రూ.321 చొప్పున రైతులకు పాతబకాయిలు చెల్లించాల్సి ఉంది. ఇందుకు గాను తాజాగా రూ.7.11కోట్లు రైతుల ఖాతాల్లో వేశారు. అదేవిధంగా ఫ్యాక్టరీ గేటు ఏరియాకు చెరకు సరఫరా చేసిన రైతులకు టన్నుకి రూ.50చొప్పున రూ.2.19 కోట్లను కూడా రైతుల ఖాతాల్లో జమచేశారు. దీంతో చెరకు రైతుల పాత బకాయిలన్నీ పూర్తిగా చెల్లించినట్టయింది. కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతభత్యాలను కూడా చెల్లించేందుకు ప్రభుత్వం రూ. 3కోట్లు ఇచ్చింది. దీంతో వారి బకాయిలు కూడా చెల్లించేందుకు యాజమాన్యం చర్యలు చేపట్టింది. గత టీడీపీ ప్రభుత్వం ఏ సీజన్‌లోనూ ఒక్క రూపాయి కూడా గ్రాంట్‌గా ఫ్యాక్టరీకిగాని, రైతులకు పేమెంట్స్ కోసం గాని ఇవ్వలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక గోవాడ చెరకు రైతులకు కేన్ పేమెంట్స్ కోసం ఇప్పటికే రూ. 37కోట్లు గత సీజన్లలో గ్రాంట్‌గా ఇవ్వగా తాజాగా మరో రూ.12.30 కోట్లు గ్రాంట్‌గా ఇచ్చిన ముఖ్యమంత్రికి రైతులు, కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు. నిధుల మంజూరుకు కృషి చేసిన స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, పరిశ్రమల మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌లకు కూడా ఫ్యాక్టరీ యాజమాన్యంతో పాటు రైతులు, కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు.

ఏయూ వీసీగా ఆచార్య ప్రసాదరెడ్డి

- మరోమారు అవకాశం కల్పించిన ప్రభుత్వం
- ఆయన హయాంలో వర్సిటీ అభివృద్ధి



ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతిగా ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి రెండవ పర్యాయం నియమితులయ్యారు. ఆయన విజన్‌ను గుర్తించి మరో పర్యాయం ఉపకులపతిగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆచార్య ప్రసాదరెడ్డి తన దార్శనికతతో వర్సిటీ రూపురేఖలను పూర్తిగా మార్చేశారు. స్టార్టప్ ఇంక్యుబేషన్ కేంద్రాలు, చైర్ ప్రొఫెసర్‌లు, వైవిధ్యమైన నూతన ప్రాజెక్టులతో ఏయూకు నూతన జవసత్వాలను అందించారు. నాక్ డబుల్ ప్లస్, 3.74 సీజీపీఏ స్కోర్ సాధించడం వెనుక ఆయన కృషి ఎంతో ఉంది. జాతీయస్థాయిలో మొదటి మూడు అత్యుత్తమ విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా ఏయూను నిలిపారు.

నవ్య ప్రగతికి సారథి

దేశంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా ఏయూను నిలపాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి ఆకాంక్షను సాకారం చేసేందుకు ఆచార్య ప్రసాదరెడ్డి వినూత్న ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేశారు. స్టార్టప్ ఇంక్యుబేషన్ సెంటర్లు నెలకొల్పడం, పరిపాలన భవనం, హాస్టళ్లు, గ్రంథాలయం ఆధునికీకరణ, పోలమాంబ ఆలయానికి అనుకుని ఉన్న దాదాపు రూ.400కోట్ల విలువైన స్థలం స్వాధీనం, రూసా నిధులతో చేపట్టిన నిర్మాణాలు, సైన్స్, ఇంజినీరింగ్ విద్యార్థులతో సమానంగా ఆర్ట్స్, న్యాయ కళాశాలల విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడం, ఇలా ఆయన తీసుకున్న నిర్ణయాలు అత్యుత్తమ ఫలితాలనిచ్చాయి. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని 84.5 లక్షల వార్షిక వేతనంతో ప్లేస్‌మెంట్ సాధించడం ఆయన హయాంలో సాధించి గొప్ప విజయం. విద్యార్థుల ప్రగతే లక్ష్యంగా ఆయన నాలుగేళ్ల పాటు శ్రమించారు. కంప్యూటర్ సైన్స్ ఆచార్యుడిగా లక్షలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దిన అనుభవం ఆయనది. 2008 నుంచి 2011 వరకు రిజిస్ట్రార్‌గా, 2011 నుంచి 2012 వరకు రెక్టార్‌గా, 2019 నుంచి వర్సిటీ వీసీగా బాధ్యతలను నిర్వర్తించారు. 2023 నవంబర్ 24తో ఆయన పదవీకాలం ముగిసింది. ఆచార్య ప్రసాదరెడ్డి సమర్థత, దార్శనికతను గుర్తించిన గవర్నర్ మరో పర్యాయం ఆయన్ని వీసీగా నియమించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలకు అయన సారథ్యం వహించనున్నారు. ఈ సందర్భంగా ఆయన్ని రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఓఎస్డీ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రిన్సిపాళ్లు ఆచార్య కె.శ్రీనివాసరావు, జి.శశిభూషణరావు, వై.రాజేంద్రప్రసాద్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

గ్రామ స్వరాజ్యం సీఎం జగన్‌తోనే సాధ్యం


సచివాలయం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు
- బైలపూడిలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు
- డిప్యూటీ సీఎంకు ఘనంగా స్వాగతం పలికిన గ్రామస్తులు


ఆర్బీకే సెంటర్‌ను ప్రారంభిస్తున్న బూడి

చీడికాడ: మహాత్ముడు కలలు కన్న గ్రామస్వరాజ్యం సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమైందని, అన్ని రకాలు సేవలు అందించే సచివాలయాల వ్యవస్థ ఇందుకు నిదర్శనంగా నిలుస్తుందని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. బైలపూడిలో రూ.1.25 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు నిర్వహించి, శిలాఫలకాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోలాటం, తీన్మార్ వాయిద్యాలతో ఆయనకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. బైలపూడిలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ. 20.80లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను ప్రారంభించి, శిలాఫలకాలను ఆవిష్కరించారు. అనంతరం ఎంపీపీ పాఠశాలలో రూ.18 లక్షలతో పూర్తిచేసిన పనులు, జెడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.43 లక్షలతో పూర్తి చేసిన పనులను పరిశీలించారు. మండల, జిల్లా పరిషత్, పంచాయతీరాజ్, విశాఖడెయిరీ సౌజన్యంతో ఏర్పాటు చేసిన 13 తాగునీటి బోర్లు, ఆర్బీకే సెంటర్ నుంచి ఫీర్ల వారి కల్లాలు వరకు సుమారు రూ.5 లక్షలతో నిర్మించిన తాగునీటి పైపులైను పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటి సీఎం మాట్లాడుతూ గతంలో ఇచ్చిన హామీ ప్రకారం బైలపూడిలో అభివృద్ధి పనులు చేపట్టినట్టు చెప్పారు. గ్రామంలో జీర్ణావస్థకు చేరుకున్న రామాలయం నిర్మాణానికి టీటీడీ నుంచి రూ.10 లక్షలు, ఎంపీ నిధుల నుంచి మరో రూ.5లక్షలు, తన సొంత నిధులు రూ.లక్ష అందజేయనున్నట్టు ప్రకటించారు. సర్పంచ్ జాజిమొగ్గల గంగతల్లి,ఎంపీపీ కురచా జయమ్మ, జెడ్పీటీసీ లాలం శారదాజానకీరాం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు,యువజన విభాగం అధ్యక్షుడు స్వామినాయుడు,విశాఖడెయిరీ డైరెక్టర్ శీరంరెడ్డి సూర్యనారాయణ, ఎ.అగ్రహారం సర్పంచ్ సలాది ధనలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నేతలు దేవినాయుడు,ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తిమ్మరాజుపేటలో సినీ నటుల సందడి


దర్శకుడు త్రినాథ్‌ను సత్కరిస్తున్న గ్రామస్తులు

మునగపాక : సంక్రాంతి సంబరాల్లో భాగంగా మంగళవారం రాత్రి తిమ్మరాజుపేటలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడిన శరగడం జగదీష్, మళ్ల లక్ష్మీనారాయణ, కాండ్రేగుల వెంకటప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ప్రముఖ సినీ దర్శకుడు నక్కిన త్రినాథరావు, సినీ, టీవీ నటులు బాలాజీ, ప్రసన్నకుమార్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారికి గ్రామస్తులు, మహిళలు కోలాటాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దర్శకుడు త్రినాథ్ మాట్లాడుతూ కళాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. తిమ్మరాజుపేట గ్రామం కళాకారులకు నిలయమని చెప్పారు.అనంతరం ప్రదర్శించిన నాట్యం, సంగీత, సాహిత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. దర్శకుడు త్రినాథ్ చేతులమీదుగా రంగ స్థల నటులు ఆదారి సూరిబాబుతో పాటు ఇతర కళాకారులను సత్కరించారు. అనంతరం దర్శకుడు త్రినాథ్‌ను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. సినీ, టీవీ నటులు బాలాజీ, ప్రసన్నకుమార్‌లు ప్రదర్శించిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

క్లుప్తంగా

ఘనంగా అమ్మవారి సారె ఊరేగింపు

అనకాపల్లి : స్థానిక వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల అమ్మవారి సారె ఊరేగింపు గురువారం నేత్రపర్వంగా నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వాకాడ బాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 20న అమ్మవారి ఉత్సవం ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. ఉత్సవంలో నేలవేషాలు, పలు స్టేజీ కార్యక్రమాలు, మందుగుండు సీతారామయ్య బాణసంచా విన్యాసాలు జాతరలో ఆకర్షణగా నిలవనున్నాయన్నారు.

ఆర్టీసీ డీఎంకు ప్రజా సంఘాల వినతి

తుమ్మపాల : జిల్లా కేంద్రం అనకాపల్లిలో గల ఆర్టీసీ బస్ కాంప్లెక్స్‌లో సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ బస్సులు రాకపోవడం ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని అధికారులు స్పందించి కాంప్లెక్స్‌లో అటువంటి సౌకర్యం కల్పించాలని కోరుతూ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆర్టీసీ డీఎంకు వినతి పత్రం అందించారు. ఆర్టీసి అధికారుల నిర్లక్ష్య దోరణి కారణంగా నూతన జిల్లా అనకాపల్లికి ఎటువంటి సౌకర్యాలు అందడం లేదన్నారు. పట్టణం జీవీఎంసీ పరిధిలో ఉన్నందున విశాఖ వరకు సీజనల్ బస్సు పాస్‌లు అములు చేయాలన్నారు. విద్యార్థులు, వికలాంగులు, బస్‌పాస్‌లు కలిగిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యలపై దృష్టి సారించి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

ఓటరు నమోదు వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో చిన్నికృష్ణ

అనకాపల్లి : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో స్థానిక ఆర్డీవో కార్యాలయంలో బుధవారం ఆర్డీవో ఏజె.చిన్నికృష్ణ పలు రాజకీయపార్టీల నేతలతో సమావేశమయ్యారు. ఓటరు నమోదు కాలేని ప్రాంతాలను గుర్తించి బీఎల్వోలకు తెలియజేయాలని సూచించారు. నమోదు కాని ఓటర్లను గుర్తించడంతోపాటు వారికి ఓటు నమోదుపై అవగాహన తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఇటీవల పలు రాజకీయపార్టీలు సైతం ఓటు నమోదు కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమన్నారు. నమోదు కార్యక్రమానికి సమయం దగ్గర పడుతోందని, మిగిలిన రాజకీయ పార్టీల నేతలు కూడా ఓటరు నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సీఏ ఉత్తీర్ణత సాధించిన మత్స్యకార యువకుడికి సత్కారం

అచ్యుతాపురం : పూడిమడకలో నిరుపేద కుటుంబంలో జన్మించి ఇటీవల విడుదలైన చార్టెడ్ అకౌంటెంట్ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన యువకుడ్ని స్థానికులు సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని సత్కరించారు. మంగళవారం పూడిమడకలో ఎరిపల్లి నాగరాజును మత్స్యకార సంఘం నేతలు సత్కరించారు. నాగరాజుని ఆదర్శంగా తీసుకోవాలని ఒరుపుల జైశంకర్ ఈ సందర్భంగా స్థానిక యువతకు పిలుపునిచ్చారు.

అనకాపల్లి సినిమాలు

గుంటూరు కారం	: రాజా
గుంటూరు కారం	: సత్యనారాయణస్క్రీన్-1
హనుమాన్	: సత్యనారాయణస్క్రీన్-2
నా సామిరంగ	: షిర్డిసాయి
సైంధవ్	: పర్తిసాయి
గుంటూరు కారం(రెండుషోలు)	
సలార్ (రెండుషోలు)	: వెంకటేశ్వర
నా సామిరంగ	: శ్రీసత్య
హనుమాన్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 110 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-11 యూనిట్లు, బీ పాజిటివ్-28 యూనిట్లు, ఓ పాజిటివ్-60 యూనిట్లు, ఏబీ పాజిటివ్-7 యూనిట్లు, ఓ నెగిటివ్-3 యూనిట్లు, ఏబీ నెగిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 251 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 459 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

గోరుముద్దకు మరింత రుచి, శుచి

- ప్రభుత్వ పాఠశాలలకు కొత్త వంట పాత్రల సరఫరా
- మధ్యాహ్న భోజన నిర్వాహకులకు తప్పిన కష్టాలు
- సిల్వర్ పాత్రల స్థానంలో స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రలు

మండలంలో జగనన్న గోరుముద్ద అమలు చేస్తున్న పాఠశాలలు	106
మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థులు	9,965
మొత్తం వంట ఏజెన్సీలు	100



జగనన్న గోరుముద్ద తింటున్న విద్యార్థులు

అనకాపల్లి : రాష్ట్రంలో విద్యారంగ అభివృద్ధికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మకమైన సంస్కరణలు తీసుకొచ్చారు. అమ్మఒడి, మనబడి నాడు-నేడు, జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన, డిజిటల్ విద్య, జగనన్న విద్యా కానుక వంటి పథకాలు అమలు చేస్తున్నారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా వసతులు కల్పిస్తూ ప్రభుత్వ స్కూళ్లను బలోపేతం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే దశల వారీగా జగనన్న గోరుముద్ద మెనూలో పలుమార్లు మార్పులు చేసి విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన, శుచికరమైన ఆహార పదార్థాలను వండి పెట్టేలా గోరుముద్ద పథకాన్ని తీర్చిదిద్దారు.

గత టీడీపీ ప్రభుత్వంలో కేవలం పప్పు, సాంబారు, నీళ్ల చారుతో విసిగి వేసారిన విద్యార్థులు ఇపుడు రోజుకో మెనూతో కొత్త రుచులను ఆస్వాదిస్తున్నారు. మధ్యాహ్న భోజనాన్ని మరింత మెరుగ్గా అమలు పరచడానికి తాజాగా ప్రభుత్వం భోజనం తయారీకి కొత్త వంట పాత్రలను అందించింది.

20 ఏళ్ల తర్వాత...

రాష్ట్రంలో మధ్యాహ్న భోజన పథకాన్ని 2003లో ప్రారంభించారు. అప్పట్లో ఇచ్చిన వంట పాత్రలనే ఇప్పటికీ నిర్వహణ కమిటీలు వినియోగిస్తున్నాయి. వంట పాత్రలన్నీ 20 ఏళ్ల నాటివి కావడంతో అరిగిపోయి చిల్లులు పడడం, వంగిపోవడం లాంటివి జరిగాయి. కొన్ని స్కూళ్లలో పాత్రలు దొంగతనానికి గురయ్యాయి. గత ప్రభుత్వాలు భోజన పథకం అమలుపై శీతకన్ను వేసి సరిగ్గా పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో చాలా స్కూళ్లలో ఏజెన్సీల నిర్వాహకులే వంట పాత్రలను సొంతంగా సమకూర్చుకుని వంటలకు ఉపయోగిస్తున్న పరిస్థితులున్నాయి. ఈ నేపథ్యంలో పాఠశాలలకు కొత్త వంట పాత్రల ఆవశ్యకతను సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గుర్తించారు. రాష్ట్రంలోని అన్ని పాఠశాలలకూ కొత్త వంట పాత్రలు సరఫరా చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు పాత అల్యూమినియం పాత్రల స్థానంలో కొత్త స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రలను అధికారులు సరఫరా చేశారు. అనకాపల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం కుక్‌లు ,సహాయకుల పని సులభతరమైంది.



కూండ్రం పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న ఏజెన్సీ నిర్వాహకులు



కొత్త పాత్రలో సిద్ధం చేసిన బిర్యానీ

5 నుంచి 11 రకాల పాత్రల వరకు..

విద్యార్థుల సంఖ్యను బట్టి పాఠశాలలను ఏ,బీ, సీ,డీ గ్రేడులుగా విభజించారు. 30 అంతకంటే తక్కువ,31 నుంచి 50 మధ్యలో ఉన్న పాఠశాలలకు 5 రకాల సామగ్రి, 51 నుంచి 150 మంది,151 నుంచి 250 మంది వరకు విద్యార్థులున్న పాఠశాలలకు 6 రకాల సామగ్రి, 251 నుంచి 400,401 అంతకంటే ఎక్కువ మంది విద్యార్థులున్న పాఠశాలలకు 11 రకాల వంట సామగ్రి సరఫరా చేశారు.

కొత్త పాత్రలతోనే వంట

మండలంలో దాదాపు అన్ని పాఠశాలలకు వంట పాత్రలు సరఫరా అయ్యాయి. కొత్త పాత్రలతోనే వంటలు చేస్తున్నారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పర్యవేక్షణ చేస్తున్నారు. కొత్త పాత్రలతో రుచి, శుచి కరమైన ఆహారం విద్యార్థులకు అందజేయడానికి వీలవుతోంది. ప్రభుత్వం జగనన్న గోరుముద్ద మెనూలో మార్పులు చేసి విద్యార్థులకు పోషకాలతో కూడిన ఆహారాన్ని అందిస్తోంది.

-ఎస్.కోటేశ్వర్రావు, ఎంఈవో-2 అనకాపల్లి

వంట నిర్వహణ సులభమైంది



పాత వంట సామగ్రితో ఆహారం వండడం కష్టంగా ఉండేది. వీటిని మార్చమని పలుమార్లు మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మా కష్టం చూసి కొత్త వంట పాత్రలు సరఫరా చేశారు. కొత్త పాత్రలు మందంగా ఉండడం, స్టెయిన్‌లెస్ స్టీల్‌వి కావడంతో మా పని సులభమవుతోంది.పాత్రలు నాణ్యమైనవి కావడంతో ఎక్కువకాలం మన్నిక ఉంటుంది. విద్యార్థులకు శుచికరమైన ఆహారం వండి పెట్టడానికి కొత్త పాత్రలు ఉపయోగపడుతున్నాయి.

-గంధం లక్ష్మి, నిర్వాహకురాలు

భజన బృందానికి ఘన సత్కారం



చినరామ భజన బృందాన్ని సత్కరిస్తున్న కోదండరామ దేవాలయ కమిటీ సభ్యులు

తుమ్మపాల : ధనుర్మాస విశిష్టతను పెంపొందిస్తూ చినరామ భజన బృందం నెలరోజుల పాటు స్వామివారి మేలుకొలుపుతో భక్తి కీర్తన భజనలు చేస్తూ ప్రజల్లో ఆధ్యాత్మికతను పెంపొందించారని చినబోయగూడం వీధి శ్రీ కోదండరామ దేవాలయ కమిటీ చైర్మన్ కర్రి రమేష్ అన్నారు. ధనుర్మాస ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని శ్రీ కోదండరామ దేవాలయంలో చినరామ భజన బృందాన్ని బుధవారం ఘనంగా సత్కరించారు. ధనుర్మాసంలో ప్రతి నిత్యం వేకువజామున లేచి భక్తిభావంతో గోదాదేవి ఊరేగింపుగా పట్టణంలో ప్రతి దేవాలయాన్ని సందర్శించి ప్రతి ఒక్కరిలోను ఆధ్యాత్మికతను పెంపొందించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్టు బృందం సభ్యులు ఆళ్ల శ్రీను, బొడ్డేడ రాజు, కర్రి రాము తెలిపారు. ప్రతిరోజు 30 మందికి పైగా స్వామివారి భక్తి కీర్తనలతో భజనలు ఘనంగా నిర్వహించారన్నారు. శ్రీ రంగనాథ గోదాదేవిల ఆశీస్సులు అందరికీ లభించి ముక్తి పొందాలన్నారు. కార్యక్రమంలో బృందం సభ్యులు పిల్లా రామ అప్పారావు, మల్ల వెంకటేష్, విల్లూరి సురేష్, పిల్లా రామకృష్ణ, బుద్ధ బుజ్జి, విల్లూరి పరమేశ్, కాండ్రేగుల నాయుడు, భక్తులు పాల్గొన్నారు.

కమనీయంగా శ్రీవారి కల్యాణం



శ్రీనివాసుని కల్యాణంలో తాతాజీ దంపతులు

అనకాపల్లి : సిద్దిలింగేశ్వరస్వామి ఆలయ చైర్మన్ నుదురుపాటి తాతాజీ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని స్థానిక నుదురుపాటి వరహాలు కల్యాణ మండపంలో బుధవారం శ్రీవారి కల్యాణం కమనీయంగా జరిగింది. కల్యాణంలో అన్నమాచార్య కీర్తనలు భక్తులకు ఆకట్టుకున్నాయి. అంతకుముందు తాతాజీ 60 మంది నిరుపేదలకు నిత్యవసర సరుకులతోపాటు వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 ఏటలోకి అడుగుపెట్టినందుకు 60 మంది నిరుపేదలకు ఈ సేవా కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వకర్త మలసాల భరత్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, నూకాంబిక దేవస్థానం చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, పార్టీ శ్రేణులు రమణరావు, శ్రీనివాసరావు, మలసాల కిశోర్, సతీష్, రమేష్‌గుప్త, కామేష్, కృష్ణకుమార్, న్యాయవాది రమణయ్య, దాడి రత్నాకర్ పాల్గొన్నారు.

పట్టణ సీఐగా శంకరరావు



అనకాపల్లి: పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐగా జి.శంకరరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ గ్రామీణ పీఎస్ నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన సీఐ దాడి మోహన్‌రావు శ్రీకాకుళం జిల్లా రాజాం పీఎస్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా నూతన సీఐ మాట్లాడుతూ నేర, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటానన్నారు. నేరాల నివారణకు సిబ్బందితో కలిసి కృషి చేస్తానని చెప్పారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక : ప్రతి ఒక్కరూ తమ తమ రంగా ల్లో రాణించాలని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ కోరారు. మునగపాక దళితవాడలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఏర్పాటు చేసిన మండల స్థాయి ముగ్గుల పోటీల విజేతలకు ఆయన మంగళవారం రాత్రి బహుమతులు అందజేశారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా తమలో ఉన్న కళను నిరూపించుకోవాలన్నారు. పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయు డు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కాశీబాబు, దళిత నేతలు బుజ్జిబాబు, పిల్లి అప్పారావు, అప్పలనాయుడు, శివ కార్యక్రమంలో పాల్గొన్నారు.

లెప్రసీ సర్వే వేగవంతం చేయాలి



మునగపాక పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా టీబీ అధికారి కిషోర్‌కుమార్

మునగపాక : మునగపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జిల్లా టీబీ, హెచ్‌ఐవీ అధికారి డాక్టర్ కిషోర్‌కుమార్ సందర్శించారు. స్థానికంగా అందుతున్న సేవలు అలాగే పరీక్ష లు, మందుల వివరాలు అడిగి తెలుసుకున్నా రు. అలాగే అన్ని జాతీయ కార్యక్రమాలు శతశాతం అమలు చేయాలన్నారు. లెప్రసీ సర్వే వేగవంతం చేయాలన్నారు. అనంతరం గ్రామం లో జరుగుతున్న లెప్రసీ సర్వే తీరును పరిశీలించా రు. సీహెచ్‌వో దేవకాంత, ఆరోగ్య పర్యవేక్షకులు ఎం.ఉమామహేష్, ఏఎన్ఎం దేవకి, పీహెచ్‌సీ సిబ్బంది రాజేశ్వరి, తులసీ, శిరీషా, జగన్నాథ రావు, మారిశెట్టి లక్ష్మి పాల్గొన్నారు.

అయోధ్యరాముని అక్షింతల పంపిణీ



కుమారపురంలో అక్షింతలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పాయకరావుపేట : కుమారపురం గ్రామంలో అయోధ్యరాముని అక్షింతలు పంపిణీ చేస్తున్నట్టు సమరసత ఫౌండేషన్ ప్రతినిధి నీలాపు వెంకటరెడ్డి అన్నారు. అయోధ్య నుంచి వచ్చిన పవిత్ర అక్షింతలు కుమారపురం, పెద్దేరు రత్నయ్యపేట గ్రామాల్లో పంపిణీ చేసినట్టు చెప్పారు. అదేవిధంగా ఈనెల 22న అయోధ్య గర్భగుడిలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ట సందర్భంగా కాషాయి జెండాను ప్రతి ఇంటిపైన ఎగురవేయాలని సూచించారు.

నేటి నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

మునగపాక : మండల స్థాయి కబడ్డీ పోటీలు గురువారం పాటిపల్లి సచివాలయ పరిధిలో ప్రారంభమవుతాయని ఎంపీడీవో ఎం.మన్మథరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా సచివాలయాల పరిధిలో ప్రతిభ చూపించిన క్రీడాకారుల కోసం మండల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహి స్తున్నామన్నారు. మండల స్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులను నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఈ అవకాశా న్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీపీఎం నేత బాలకృష్ణ సంస్మరణ సభ

తుమ్మపాల : సీపీఎం సీనియర్ నాయకుడు, కార్మిక, రైతు, ప్రజా ఉద్యమ నాయకుడు అంగుళూలి బాలకృష్ణ సంస్మరణ సభ పట్టణంలోని ముదిరాజ్ కాలనీలో జరిగింది. నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజల కోసం ఎన్నో పోరాటాలు చేసిన ఉద్యమ నాయకుడిగా అయన్ను పలువురు అభివర్ణించారు. కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి తన వంతు సహాయంగా ప్రజలకు కూరగాయలు, నిత్యవసరాలు పంచిన ధైర్యశాలిగా మాజీ ఎమ్మెల్యే గోవింద సత్యనారాయణ కొనియాడారు. త్వరలోనే ఆయన గుర్తుగా కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మళ్ల సురేంద్ర, పోలరపు త్రినాథ్, పచ్చికూర రాము, తలారి కాశి నాయుడు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే ఆధునిక వైద్యసేవలు



జగనన్న సురక్ష వైద్య శిబిరంలో పాల్గొన్న జానకీరామరాజు, వెంకటరమణ

అనకాపల్లి : ఇళ్ల వద్దకే ఆధునిక వైద్యసేవలు ఘనత సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీ రామరాజు అన్నారు. విజయరామరాజుపేట సచివాలయంలో బుధవారం మలివిడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని జెడ్పీ వెంకటరమణతో కలిసి ఆయన ప్రారంభించారు. ఎన్నడూ చూడని విధంగా తమ ప్రభుత్వ హయాంలో ఖరీదైన వైద్య సేవలు అందిస్తోందని పేర్కొన్నారు. శిబిరంలో వైద్యులు పలువురిని పరీక్షించి, ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, ఎన్టీఆర్ వైద్యాలయం డైరెక్టర్ ఎం.శ్రీను, పార్టీ శ్రేణులు పలకా సత్యనారాయణ, శ్రీనివాసరావు, వేగి త్రినాథ్, దొడ్డి హరిబాబు, మోహన్, నూకరాజు, రాంజీ, పెంటకోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



డీసీఎంఎస్ ఆవరణలో కబడ్డీ క్రీడలో బాలికలు

అనకాపల్లి : స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానంతో పాటు డీసీఎంఎస్ ఆవరణలో బుధవారం ఆడుదాం- ఆంధ్రా క్రీడా పోటీలు హోరా హోరీగా సాగాయి. డీసీఎంఎస్ ఆవరణలో బాలికలు కబడ్డీ పోటీలు నిర్వహించగా ఎన్టీఆర్ క్రీడా మైదానంలో క్రికెట్ పోటీలు జరిగాయి. క్రీడల్లో తమ సత్తా చాటుకునేందుకు క్రీడాకారులు చురుగ్గా పాల్గొన్నారు.

ఘనంగా రాములోరి తీర్థం



తీర్థంలో చిన్నారుల సందడి

అనకాపల్లి : మార్టూరు గ్రామంలో రాములోరి తీర్థం నేత్రపర్వంగా జరిగింది. ఉదయం నుంచి స్వామివారి ఆలయానికి భక్తులు బారులు తీరారు. ఆలయ అర్చకులు సీతా సమేత శ్రీరామచంద్రమూర్తికి ప్రత్యేక పూజలు జరిపారు. సాయంత్రం ఆలయం ముందు తీర్థం జరిగింది. తీర్థంలో రంగులరాట్నం, చిన్నారుల ఆటవస్తువులు వెలిశాయి. రంగులరాట్నం ఎక్కేందుకు చిన్నాపెద్దా క్యూకట్టారు. జంపింగ్ స్ప్రింగ్‌తో చిన్నారులు ఆటలాడుకున్నారు.

రైతు నేస్తాల సందడి..



రామారాయుడుపాలెం సమీపంలో పంట పొలంలో కొంగల గుంపులు

యలమంచిలి రూరల్ : పొలాల్లో రైతు నేస్తాలు సందడి చేస్తున్నాయి. రైతులు రబీ సీజన్‌కు పొలాలను దున్ని సాగుకు సిద్ధం చేసుకుంటున్న సమయంలో తెల్లటి కొంగలు గుంపులు గుంపులుగా చేరి ఆహారం కోసం అన్వేషిస్తున్నాయి. పొలంలోని పురుగులను తింటూ ఆకలిని తీర్చుకుంటున్నాయి. రామారాయుడుపాలెం, సోమలింగపాలెం, పురుషోత్తపురం తదితర గ్రామాల సమీపంలోని పంట పొలాల్లో తెల్లటి కొంగల గుంపులు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

మార్టూరులో గుర్రాల పరుగు పోటీలు



గుర్రాల పోటీలను ప్రారంభిస్తున్న మలసాల భరత్‌కుమార్

తుమ్మపాల : మార్టూరు గ్రామంలో శ్రీసీతారాముల తీర్థ మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ప్రతి ఏటా కనుమ మరుసటి రోజున నిర్వహించే సీతారాముల ఉత్సవాన్ని యధావిధిగా ఈ ఏడాది వైభవంగా గ్రామ ప్రజలందరూ కలిసి నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ రామాలయంలో సీతారాములను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం గ్రామంలో ఏర్పాటు చేసిన గుర్రాల పరుగు పోటీలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఐ రవికుమార్, వైఎస్సార్‌సీపీ గ్రామపార్టీ అధ్యక్షుడు కరణం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కారు ఢీకొని తాపీమేస్త్రి మృతి



సత్తిబాబు (57)

కశింకోట : నరసింగబిల్లి వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తాపీమేస్త్రి మృతి చెందాడు. సీఐ ఎం. వినోద్‌బాబు అందించిన వివరాల ప్రకారం..యలమంచిలి నుంచి అనకాపల్లి వైపు వస్తూ నరసింగబిల్లి కూడలి వద్ద రోడ్డు దాటుతున్న మోపెడ్‌ను అదే మార్గంలో కారు వచ్చి ఢీకొంది. దీంతో మోపెడ్ నడుపుతున్న యలమంచిలి మండలం కొక్కిరాపల్లి వద్ద అగ్రహారానికి చెందిన సుందరపు సత్తిబాబు(57) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సొంత పని మీద తన గ్రామం నుంచి నరసింగబిల్లి వస్తుండగా ప్రమాదం జరిగింది. ఈ మేరకు అందిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని అనకాపల్లి పోస్టుమార్టంకు తరలించినట్లు సీఐ తెలిపారు. కేసు దర్యాప్తులో ఉందన్నారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు.

అన్ని వర్గాలకూ సంక్షేమ ఫలాలు

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు
- బైలపూడిలో గడపగడపకు మన ప్రభుత్వం



వృద్ధురాలితో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

చీడికాడ: రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. మండలంలోని బైలపూడిలో బుధవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రతి కుటుంబాన్ని కలిసి, బుక్‌లెట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడిన ప్రభుత్వం మనదని, అందుకే కులం, మతం,పార్టీ,ప్రాంతం,వర్గం అనే తేడా లేకుండా సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం గ్రామానికి మంజూరు చేసిన రూ.1.10 కోట్లతో జల్‌జీవన్ మిషన్ కింద 90 వేల లీటర్ల వాటర్ ట్యాంకు నిర్మాణం, ఇంటింటీ కుళాయి ఏర్పాటు పూర్తయిందని చెప్పారు. ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించామని, వెంటనే పనుల చేపట్టాలని సూచించారు. గ్రామంలో లబ్ధిదారులకు రూ.1.25 కోట్లతో సంక్షేమ పథకాలు అందజేశామని చెప్పారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు డిప్యూటీ సీఎం తాజాగా రూ.10 లక్షలు కేటాయించారు. గ్రామంలో అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ స్తంభాలు మార్పు చేయాలని అధికారులను ఆదేశించారు. బైలపూడి నుంచి దిబ్బపాలెం, బైలపూడి నుంచి ఎ.అగ్రహారానికి తారురోడ్డునిర్మాణానికి ప్రతిపాదనలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాకే తమకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ఇప్పుడు సంతోషంగా జీవిస్తున్నామని చెప్పారు. మా పెద్దకొడుకు జగనే..మాకు ప్రతిరోజు బువ్వపెడుతున్నాడని ఆనందంతో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడును వృద్ధులు,వికలాంగులు ఆలింగనం చేసుకుని హర్షం వ్యక్తం చేశారు. ముందుగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి,వైఎస్సార్ విగ్రహాలకు బూడి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగతల్లి, ఎంపీపీ కురచా జయమ్మనారాయణమూర్తి, జెడ్పీటీసీ లాలం శారదాజానకీరాం, వైఎస్సార్‌సీపీ చీడికాడ, దేవరాపల్లి మండలాల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, బురే బాబురావు, యూత్ అధ్యక్షులు స్వామినాయుడు, వైఎస్సార్‌సీపీ గ్రామ నేతలు జి.తారకేసు,జాజిమొగ్గల ఈశ్వరరావు,గొల్లవిల్లి సన్యాసిరావు తదితరులుపాల్గొన్నారు.